ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 15 మార్చి 2025

ఒంటి పూట బడి

నేటి నుంచి అమలు



అనంతపురం విద్య, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి ఒంటి పూట బడి నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ మాత్రమే తరగతులను నిర్వహిస్తారు. ఈ విద్యాసంవత్సరం చివరి తేదీ అయిన ఏప్రిల్ 23వ తేదీ ఇది అమలవుతుంది. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు అన్నీ ఈ ఆదేశాలను పాటించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులను నిర్వహిస్తారు.

ఇవి తప్పనిసరి..

వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో కచ్చితంగా ఒంటిపూట బడి నిర్వహించాలి. అవసరమైన చోట గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సహకారంతో పాఠశాలల్లో తాగునీటిని ఏర్పాటు చేయాలి. బహిరంగ ప్రదేశాలు, చెట్ల కింద తరగతులను నిర్వహించకూడదు. వడదెబ్బ తగిలితే వెంటనే అందించడానికి వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి. స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థల సహకారంతో వీలైతే మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు పాఠశాల వదిలే చివరి గంటలో వడ్డించాలి. ఈ నిబంధనలన్నీ తప్పకుండా అమలయ్యేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలి.

కార్పొరేట్లు వింటారా..?

ఒంటిపూట బడి అమలు గురించి కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఇప్పటికే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాయి. పాటించే ఉద్దేశం లేనివారు మాత్రం శుక్రవారం రాత్రి వరకూ ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఎప్పటిలాగే ఫుల్ డే నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తల్లిదండ్రులు అడిగితే.. సోమవారం నుంచి అమలు చేస్తామని చెబుతున్నారు. కొన్ని కార్పొరేట్ పాఠశాలలో హోలి రోజు కూడా సెలవు ఇవ్వలేదు. ఉల్లంఘనలపై డీఈఓ చర్యలు తీసుకుంటారా, వదిలేస్తారా అన్న చర్చ జరుగుతోంది.

రంగ్ దే!

అంబరాన్నంటిన హోలీ సంబరాలు



హోలీ సంబరాలు చేసుకుంటున్న మార్వాడీలు

చిన్నా.. పెద్దా అంతటా హోలీ.. సందడే..


ఐదోరోడ్డులో హోలీ సంబరం చేసుకుంటున్న మహిళలు

అనంతపురం కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరం శుక్రవారం ఘనంగా జరిగాయి. పిల్లలు, పెద్దలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనంద డోలికల్లో మునిగితేలారు. అనంతపురం నగరంతోపాటు... బంజారాలు అధికంగా ఉండే తండాలలో వేడుకలు వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల్లో కాముడి దహనం కార్యక్రమాలు చేశారు. ఇస్కాన్ మందిరంలోనూ హోలికా దహనం చేపట్టారు. జిల్లా కేంద్రంలో యువకులు బైక్‌లపై తిరుగుతూ రంగులు చల్లుకున్నారు. బంజారాలు డ్రమ్స్ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ర్యాలీగా తిరుగుతూ సంబరాలు జరుపుకున్నారు. మహిళలు కంకుమనీళ్ల, సంప్రదాయ రంగులతో సంబరం చేసుకున్నారు. పిల్లలు వాటర్ గన్‌లతో రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.



విద్యార్థుల జీవితాలతో చెలగాటం..!

ఇంటర్ తొలిరోజు పరీక్షకు అరగంట ఆలస్యం..?

- వాహనాలను సమకూర్చని ఓ కాలేజీ యాజమాన్యం
- రోడ్డుపై దొరికిన వాహనాల్లో వెళ్లిన విద్యార్థులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దారుణం

అనంతపురం విద్య, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థుల జీవితాలతో నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీ యాజమాన్యం ఆడుకుంది. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను తరలించేందుకు వాహనాలను సమకూర్చుకోవడంలో ఘోరంగా విఫలమైంది. ఉదయం 8 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉన్నా.. కాలేజీ వద్దకు వాహనాలు రాలేదు. దీంతో విద్యార్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఆలస్యంగా మేల్కొన్న యాజమాన్యం, రోడ్డుపై వెళ్లే ప్రతి వాహనాన్నీ ఆపి, బతిమాలి విద్యార్థులను తరలించింది. ఫలితంగా తొలిరోజు పరీక్షకు వందలాది మంది విద్యార్థులు సుమారు అర గంట నుంచి 45 నిమిషాలు ఆలస్యంగా వెళ్లినట్లు తెలిసింది. ఈనెల ఒకటో తేదీన జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



ఇంత దారుణమా..?

అనంతపురం నగర శివారులో, ఎస్కేయూ వెళ్లే రహదారిలో ఉంటుంది ఆ కళాశాల. విశ్వసనీయ సమాచారం మేరకు, ఈ నెల 1వ తేదీ ఉదయం 7.45 గంటల నుంచి 9 గంటల నడుమ తీవ్ర ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. దీనికి కారణం.. పరీక్షలకు విద్యార్థులను తరలించేందుకు మాట్లాడుకున్న ఆటోలు రాకపోవడమే. సుమారు 80 ఆటోలను మాట్లాడుకున్నా, కొందరు మాత్రమే వచ్చారని తెలిసింది. దీంతో మిగిలిన విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు హైరానా పడ్డారు. ఎస్కేయూ నుంచి అనంతపురం నగరంలోకి వస్తున్న వాహనాలన్నింటినీ ఆపేశారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను తీసుకువెళ్లాలని బతిమాలారు. వందలాది మంది విద్యార్థులను దొరికిన వాహనాల్లో ఎక్కించారు. ఆటోలు, బస్సులు, బైక్‌లు.. ఇలా ఏవి దొరికితే వాటిలో పంపించారు. ఈ క్రమంలో చాలా మంది విద్యార్థులు హైటెన్షన్‌కు గురయ్యారు.

ఆలస్యమైనా అనుమతించారా..?

అప్పటికే ఆలస్యం..! దీనికితోడు ట్రాఫిక్ రద్దీ..! అన్నింటినీ దాటుకుని, 'అతిథి' వాహనాల్లో నగరంలోని పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు వెళ్లే సరికి 30 నిమిషాలు ఆలస్యమైందని సమాచారం. విద్యార్థులు ఉదయం 8 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి. 9 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. కానీ విద్యార్థులు వెళ్లే సరికి 9.30 గంటలు దాటిందని సమాచారం. సందులు, శివారు కాలనీల్లో పరీక్షా కేంద్రాలకు చేరుకునే సరికి 9.45 దాటిందని తెలిసింది. ఇంత ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారని విశ్వసనీయంగా తెలిసింది. విద్యార్థులు కేంద్రాల్లోకి వెళ్లే సరికి ప్రశ్నాపత్రాలను కూడా ఇచ్చేశారు. ఆలస్యంగా కారణంగా విపరీతమైన ఒత్తిడికి లోనైన విద్యార్థులు, హడావుడిగా పరీక్షలు రాశారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు విలువైన సమయాన్ని కోల్పోయారు. ఉన్నతాధికారులు విచారిస్తే మరిన్ని దారుణాలు బయటపడతాయని పలువురు అంటున్నారు. కాలేజీ యాజమాన్యం, అధికారుల పాత్ర ఏమిటో ఇట్టే తెలిసిపోతుందని అంటున్నారు.

కార్పొరేషన్లు ఖాళీ

- కీలక పోస్టులు ఖాళీ
- రుణాల ప్రక్రియలో ఇబ్బందులు (6లో...)

- బీసీ, ఎస్సీ కార్పొరేషన్లలో అధికారుల కొరత

మహిళల రక్షణకు శక్తి

జిల్లాలో ఐదు ప్రత్యేక బృందాలు..: ఎస్పీ జగదీష్



శక్తి యాప్

అనంతపురం క్రైం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆపద సమయాలలో మహిళలు, అమ్మాయిల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన శక్తి యాప్ గురించి విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ జగదీష్ పోలీసు అధికారులు, శక్తి టీమ్స్‌ను ఆదేశించారు. ప్రతి మహిళ తమ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, పోలీసుల సాయం పొందేలా చైతన్యపరచాలని సూచించారు. ఈ యాప్ ద్వారా హింసాత్మక ఘటనల నుంచి మహిళలు రక్షణ పొందవచ్చని అన్నారు. ఏదైనా ప్రమాదం తలెత్తితే యాప్ ఓపెన్ చేసి ఎస్‌ఓఎస్ బటన్‌ను నొక్కితే.. బాధితులు ఉన్న లొకేషన్‌ను పోలీసులు గుర్తించి, తక్షణమే స్పందిస్తారని తెలిపారు.

రంగంలోకి ఐదు శక్తి బృందాలు

జిల్లాలో మహిళల భద్రత కోసం 5 శక్తి బృందాలను ఈ నెల 8న రంగంలోకి దింపామని ఎస్పీ తెలిపారు. సబ్ డివిజన్‌కు ఒక శక్తి బృందం ఉంటుందని, ఎస్ఐ నేతృత్వంలోని ఒక్కో బృందంలో ఇద్దరు మహిళా సిబ్బంది, నలుగురు కానిస్టేబుళ్లు ఉంటారని తెలిపారు. ఈ బృందాలు జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్లలో మఫ్టీలో నిఘా వేస్తాయని తెలిపారు. మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతారని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన శక్తి బృందాలు అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం సబ్ డివిజన్లలో విధులు నిర్వర్తిస్తాయని తెలిపారు. అదనపు ఎస్పీ నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. ఆపద సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఎస్‌ఓఎస్, డయల్ 112/100 కాల్స్‌తో సంఘటనా స్థలానికి ఈ టీమ్స్ వెళతాయని తెలిపారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై, సంఘటనా స్థలానికి చేరుకోవాలని, సమస్యను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

విదేశీ పక్షి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కోకాటైల్ పక్షి

గుంతకల్లు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరం గేట్ సమీపంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన విదేశీ పక్షి కోకాటైల్‌ను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్కే పెట్ జోన్ దుకాణంలో విదేశీ పక్షిని విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో జిల్లా అటవీ శాఖ అధికారి అదేశాల మేరకు గుత్తి రేంజర్ మధుబాబు, గుంతకల్లు సెక్షన్ ఆఫీసర్ కరీం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. పక్షిని స్వాధీనం చేసుకుని, దుకాణ నిర్వాహకుడు రాఘవేంద్రపై కేసు నమోదు చేశారు. కోకాటైల్ పక్షిని విక్రయించడం వణ్యప్రాణి చట్టం కింద నేరమని వారు తెలిపారు.



ఉష్ణోగ్రతలు శుక్రవారం	
గరిష్ఠం	39.0
కనిష్ఠం	23.0



ఇఫ్తార్	సెహరీ
6.31	5.11
శనివారం సాయంత్రం	ఆదివారం ఉదయం

జిల్లాలోని ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు ఖాళీ అయిపోయాయి. అధికారుల సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఏళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో కార్పొరేషన్లలో అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించడం లేదనే చెప్పాలి. ఎస్సీ కార్పొరేషన్‌లో అత్యంత ప్రాధాన్యత ఉన్న ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆర్థికపరమైన అంశాలతో ముడిపడిన ఆ పోస్టులు ఏళ్లుగా ఖాళీగా ఉండటం గమనార్హం. ఈడీ పోస్టే కొన్ని నెలలుగా ఖాళీగా దర్శనమిస్తోంది. ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీంతో పాలనాపరమైన అంశాల్లో సమస్యలు తలెత్తుతున్నట్లు ఆ శాఖలోని అధికారులు పేర్కొంటున్నారు. ఇక బీసీ కార్పొరేషన్‌లో సైతం అధికారుల కొరత పట్టి పీడిస్తోంది. ఆ కార్పొరేషన్‌లో ఒక ఏఈఓ, రెండు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ పడ్డాయి. ప్రస్తుతం ఆయా కార్పొరేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ రుణాల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో అధికారుల కొరత పెద్ద తలనొప్పిగా మారిందనే చెప్పాలి. ఇప్పటికైనా పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్


ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం (పెన్నార్ భవన్)




కార్పొరేషన్లు ఖాళీ!

బీసీ, ఎస్సీ కార్పొరేషన్లలో అధికారుల కొరత

- కీలక పోస్టులు ఖాళీ
- రుణాల ప్రక్రియలో ఇబ్బందులు

రెగ్యులర్ ఈడీ లేక..

ఎస్సీ కార్పొరేషన్‌లో కీలకమైన ఈడీ పోస్టు నాలుగైదు నెలలుగా ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఆ పోస్టును ఎస్సీ సంక్షేమశాఖ డీడీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ పోస్టుతో ఎస్సీ కార్పొరేషన్‌లో రెండు చొప్పున ఈఓ, ఏఈఓ, సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని వెంటనే భర్తీ చేయాల్సి ఉన్నా.. జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ శాఖలో ఉన్న నలుగురైదుగురు ఉద్యోగులు కూడా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారే. కార్పొరేషన్‌లో గతంలో సబ్సిడీ రుణాలు, వాహనాలు తీసుకున్న వారి నుంచి రికవరీ చేయడం పెద్ద సమస్యగా మారిందనే చెప్పాలి. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్‌లో పలు రకాల సబ్సిడీ రుణాలకు సంబంధించిన ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలోనే ఆ రుణాల ప్రక్రియ మొదలు కానుంది. ఇప్పటికీ పాత బకాయిలను రికవరీ చేసేందుకే తంటాలు పడుతున్న సిబ్బంది... కొత్తగా రుణాల ప్రక్రియ మొదలైతే అంతే సంగతులంటూ వాపోతున్నారు.

బీసీ కార్పొరేషన్‌లోనూ..

బీసీ కార్పొరేషన్‌లో ఈడీ దిగువస్థాయిలో ఉండే ఏఈఓ అధికారి గతేడాది ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఆ పోస్టులో ఎవరినీ నియమించలేదు. కార్పొరేషన్‌లో రెండు సీనియర్ అసిస్టెంట్ ఖాళీలున్నాయి. ప్రస్తుతం బీసీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాల ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో ఈడీతోపాటు మరో అధికారి మాత్రమే తంటాలు పడుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లాను సైతం అనంత జిల్లా అధికారులే పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో ఆ జిల్లాలో సైతం సమస్య ఉత్పన్నమవుతోంది. గతంలో ఇక్కడున్న ఏఈఓ స్థాయి అధికారికి శ్రీసత్యసాయి జిల్లా కార్పొరేషన్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం అక్కడ అధికారుల కొరత ఏర్పడటంతో సమస్య తీవ్రమవుతోందనే చెప్పాలి.

కొరత వాస్తవమే..



ఎస్సీ కార్పొరేషన్‌లో అధికారుల కొరత ఉన్న మాట వాస్తవమే. రెండేసి ఈఓ, ఏఈఓ, సీనియర్ అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రికవరీల్లో కొంత ఇబ్బందిగా ఉన్నప్పటికీ అనుకున్న మేరకు చేస్తున్నాం. అధికారుల కొరతపై ఉన్నతాధికారులకు వివరించాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- రాధిక, ఇన్‌చార్జి ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

కావాలని అడుగుతున్నాం



బీసీ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న ఏఈఓ, రెండు సీనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం రుణాల ప్రక్రియ సాగుతుండడంతో పర్యవేక్షణ నిమిత్తం ఇతర శాఖల నుంచి అధికారులను సర్దుబాటు చేయాలని కోరాం. ఎవరైనా ముందుకొస్తే... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియమించుకుంటాం.

- సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్

చెయ్యికి చెయ్యి.. తలకు తల

వైసీపీ నేత రెచ్చగొట్టే వ్యాఖ్యలు



హిందూపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ వర్గీయులపై దాడులను సహించం. ఇకపై చెయ్యికి చెయ్యి.. తలకు తల..' అని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక భర్త, ఆ పార్టీ నేత వేణురెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. జంగాలపల్లి టీడీపీ దళిత నాయకుడు సాయికుమార్, ఆయన భార్యపై అదే గ్రామానికి చెందిన మాజీ వలంటీరు అశ్వర్థ, దేవేగౌడ, మరొకరు గురువారం రాత్రి దాడిచేశారు. ఈ గొడవవలో ఇరువర్గాలవారికీ గాయాలయ్యాయి. పాత కక్షల కారణంగా ఈ గొడవ జరిగిందని పోలీసులు తెలిపారు. గాయపడ్డ ఇరువర్గాల వారు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వేణురెడ్డి, ఇతర నాయకులు శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. తమ పార్టీ వర్గీయులను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. దాడులు పునరావృతం అయితే చెయ్యికి చెయ్యి, కాలుకు కాలు, తలకు తల ఉంటుందని హెచ్చరించారు. ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకునే అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.

నేత్రపర్వంగా కల్యాణం

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు


చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాడికి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాడికిలోని చెన్నకేశవస్వామి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ కట్టపై సంప్రదాయబద్ధంగా బ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్‌డీ శశికళ, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా రథోత్సవం

చెన్నకేశవస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం తేరు మిద్దె వద్ద నుంచి స్థానిక కెనరా బ్యాంక్ వరకు మడుగు తేరు లాగారు. భోజన విరామ అనంతరం రథోత్సవాన్ని కొనసాగించారు. రథోత్సవంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యాడికిలోని మార్కెట్‌యార్డులో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.


చెన్నకేశవస్వామి రథోత్సవం

ఫాంపాండ్ వద్ద ఏర్పాటు చేసిన బోరు ద్వారా నీటిని తోడుతున్న రైతులు



ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు ఎన్నో చేయవచ్చు. కొండల్లో, గుట్టల్లో ప్రయోజనం లేని పనులు ఎక్కువ చేస్తుంటారనే అభిప్రాయం విస్తృతంగా ఉంది. కానీ, రైతుల పొలాల్లో చేపడుతున్న నీటికుంటలతో ఎంతో ఉపయోగం ఉంటుంది. వర్షపు నీటిని ఒడిసి పట్టడమే కాకుండా.. నిల్వచేసిన నీటిని పండ్లతోటలకు ఉపయోగించవచ్చు. బోర్ల సమీపంలో నీటికుంట తవ్వుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయి. జిల్లాకు 5,780 నీటికుంటల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 872 మాత్రమే పూర్తి చేశారు. కొందరు ఏపీఓల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.


నీటికుంట తవ్వకం పనుల్లో ఉపాధి కూలీలు

వాననీటిని ఒడిసిపట్టే నీటికుంటలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో నీటికుంటలు తవ్వకానికి డ్వామా అధికారులు సిద్ధమయ్యారు. ఇటు రైతులకు, అటు ఉపాధి కూలీలకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. రైతులకు నీటికుంట తవ్వకంతో పాటు ఉచితంగా 10 రకాల పండ్లమొక్కలు, కూరగాయలు, తీగజాతి మొక్కలు అందజేస్తారు. ఒక్కో నీటికుంట తీయడానికి 200 పనిదినాలు నమోదవుతాయి. 2లక్షల లీటర్ల నీటిని నిల్వచేసే అవకాశం ఉంది. వర్షపునీరు రైతు పొలాల నుంచి బయటకు వెళ్లకుండా అక్కడే ఈ కుంటల్లో నిల్వచేయవచ్చు. నిల్వచేసిన నీటిని పశువులు, పక్షులు, పంటలకు పురుగుమందు చల్లేందుకు ఉపయోగించుకోవచ్చు. జిల్లాకు 5,780 నీటికుంటల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 872 పూర్తి చేశారు. ఈనెలాఖరులోపు లక్ష్యాన్ని పూర్తి చేస్తే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా జిల్లాలో వీటిని ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నీటికుంట ఎందుకంటే..?

రైతులు తమ పొలంలో వచ్చే వర్షపునీటిని నిల్వచేసుకునేందుకు, రైతు పొలంలోనే ఏర్పాటు చేసుకునే చిన్ననీటి మడుగులను ఫాంపాండ్ లేదా నీటికుంట అంటారు. ఎండాకాలంలో పొలంలో పశువులకు, పక్షులకు తాగునీరు అందించేందుకు పండ్లతోటల పెంపకానికి, పరిమిత ప్రాంతంలో కూరగాయల పెంపకానికి, పంటలకు పురుగు మందులను చల్లేందుకు అవసరమైన నీటిని ఈ నీటికుంట అందిస్తుంది. రైతులు తమ పొలంలో పడిన వర్షపునీరంతా ఒకేవైపు చేరడానికి అవకాశం ఉండి, నీరు నిల్వ చేసేందుకు అనుకూలంగా ఉన్న పొలంలోని పల్లపు ప్రాంతాన్ని గుర్తించాలి.

లక్ష్యానికి దూరంగా..

జిల్లాలో ఈ ఏడాదిలో 5,780 నీటికుంటలను నిర్మించాలని డ్వామా అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు 4,941 నీటికుంటల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. వీటిలో 872 పూర్తి చేయగా, 1824 నిర్మాణదశలో ఉన్నాయి. నీటికుంటల నిర్మాణంలో జిల్లాలో చాలా మండలాలు వెనుకబడి ఉన్నాయి. బొమ్మనహాల్, గుత్తి, కళ్యాణదుర్గం, కణేకల్లు, కూడేరు, ఉరవకొండలో ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. గుంతకల్లు, రాప్తాడు, యల్లనూరు, బెళుగుప్ప, విడపనకల్లు, రాయదుర్గం, పామిడి, డి.హీరేహాల్, అనంతపురం రూరల్, గార్లదిన్నె, కంబదూరు మండలాలు 10 నీటికుంటలు కూడా దాటలేదు. కరువు మండలాలు నార్పల, రాప్తాడు, విడపనకల్లు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, యాడికి, అనంతపురం రూరల్ మండలాల్లో అదనంగా ఉపాధి కూలీలకు 50రోజుల పనిదినాలు కల్పిస్తూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.


పూర్తయిన నీటి కుంట

పండ్లతోటల రైతులకు ఉపయోగం

కూలీలకు ఉపాధి

5,780 లక్ష్యం..

872 మాత్రమే పూర్తి

పలు మండలాల్లో నిర్లక్ష్యం

రైతులకు ఉపయోగకరం



జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న నీటికుంటలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వర్షపునీరు పడే చోట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోకుండా నీటికుంటల్లో నిల్వచేయవచ్చు. దీంతో నిల్వచేసిన నీటిని రైతులు అనేకరకాలుగా ఉపయోగించుకోవచ్చు. జిల్లాలో రైతులకు అవగాహన కల్పించి పొలంలో ఫాంపాండ్లు తవ్వుకునేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. చాలా మండలాలు వెనుకబడి ఉన్నాయి. ఆయా మండలాల ఏపీఓలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చి వేగవంతం చేయాలని ఆదేశించాం. నీటికుంటల నిర్మాణంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కలెక్టర్ ఆదేశాలతో సమష్టిగా కృషి చేస్తున్నాం.

-సలీంబాషా, డ్వామా పీడీ

సంచార పశువైద్యం బంద్..!

అనంతపురం అర్బన్/విడపనకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచార పశు వైద్య సేవలు నిలిచిపోయాయి. 2022 సంవత్సరంలో తొలి విడత కింద జిల్లా వ్యాప్తంగా ఏడు పశు సంచార వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. నియోజకవర్గ కేంద్రంలోని పశువుల ఆసుపత్రుల్లో ఆయా వాహనాలను ఉంచి, వచ్చిన కాల్ ఆధారంగా సేవలు అందిస్తూ వస్తున్నారు. అప్పట్లో జీవీకే సంస్థకు సంచార వాహనాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16తో ఆ సంస్థతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం పూర్తయింది. దీంతో తొలి విడతలో మొదలు పెట్టిన పశు సంచార వాహనాలను నిలిపివేశారు. సంచార వాహనాల్లో విధులు నిర్వర్తిస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వాహనాలను అర్థంతరంగా నిలిపేశారు. యథావిధిగా విధులకు వెళ్లిన వెటర్నరీ డాక్టర్లు, సిబ్బందికి చేదు అనుభవం ఎదురైంది. వాహనాలను నిలిపివేశామని, ఇక నుంచి విధులకు హాజరుకావాల్సిన అవసరం లేదని అక్కడి అధికారులు చెప్పారు.

తొలి విడతలో 7 వాహనాల నిలిపివేత

డాక్టర్లు, సిబ్బందికి సమాచారమే ఇవ్వని వైనం

కాంట్రాక్టు ముగియడంతో నిలిపివేశామంటున్న యంత్రాంగం

ఆయా ప్రాంతాలకు నిలిచిన సేవలు

రైతులు, పశువుల కాపర్లకు తిప్పలు



పశు సంచార వాహనం

సగం మండలాలకు నిలిచిన సేవలు

అనంతపురం అర్బన్, శింగనమల, ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ కేంద్రాల్లో 2022 సంవత్సరంలో తొలి విడతలో పశు సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నెంబర్ 1962కు రైతులు ఫోన్ చేసిన ప్రాంతాలకు సంచార వాహనంలో వెళ్లి పశువులు, మూగజీవాలకు వైద్యం అందిస్తున్నారు.

రెండో విడతలో 2023 ఫిబ్రవరి నుంచి అనంతపురం రూరల్, పుట్లూరు, యాడికి, గుత్తి, కూడేరు, శెట్టూరు, కణేకల్లు మండల కేంద్రాల్లో మరో ఏడు పశు సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. ఫోన్ కాల్స్ ఆధారంగా క్షేత్రస్థాయికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16 నుంచి తొలి విడతకు చెందిన పశు సంచార వాహనాలను నిలిపివేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా సగం మండలాల్లోని పశువులు, మూగజీవాలకు సంచార సేవలు పూర్తిగా బంద్ అయ్యాయి. తిరిగి ఆయా ప్రాంతాలకు పశు సంచార వాహనాలను ఎప్పుడు పంపుతారో తెలియని అయోమయం ఏర్పడింది.


పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది (ఫైల్)

వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది ఆందోళన

పశు సంచార వాహనాల ద్వారా వైద్య సేవలు అందించేందుకు వెటర్నరీ డాక్టర్లు, అసిస్టెంట్లు, డ్రైవర్లను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. ఒక్కో వాహనంలో ఒక వెటర్నరీ డాక్టర్, పారావెట్ (వెటర్నరీ అసిస్టెంట్), పైలెట్ (డ్రైవర్) పనిచేస్తున్నారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న జీవీకే సంస్థ ద్వారా వీరికి వేతనాలు ఇస్తున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఉన్నట్లుండి వాహనాలు నిలిపివేయడంతో తాము రోడ్డుమీద పడ్డామని వారు ఆవేదన చెందుతున్నారు. సంచార వాహనాలు తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారు..? తమను ఉద్యోగంలోకి తీసుకుంటారా..? లేదా అనే కనీస సమాచారం కూడా ఎవరూ ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం ఎదుట బాధిత వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు.

సంచార సేవలను ప్రారంభించాలి



నాకు కాడెద్దులు, ఆవు, ఎనుము ఉన్నాయి. గతంలో సంచార పశు వాహనం ఊళ్లోకి వచ్చేది. ఫోన్ చేస్తే వచ్చి పశువులకు చికిత్స అందించేవారు. పశువులు నడవలేని స్థితిలో ఉన్నప్పుడు సంచార వాహన సేవలు ఎంతో ఉపయోగపడ్డాయి. మూడు వారాలుగా సంచార వాహనం రాలేదు. సంచార వాహనాన్ని తిరిగి ఏర్పాటు చేసి, పశువులకు వైద్య సేవలు అందించాలి.

-గంగన్న, రైతు, విడపనకల్లు

జీవాలకు చికిత్స చేసేవారు



గొర్రెలు, మేకలను సాకుతూ జీవనం సాగిస్తున్నా. అత్యవసరంగా గొర్రెలు, మేకలకు చికిత్స అవసరమైతే సంచార వాహనం నెంబర్ 1962కు ఫోన్ చేస్తే నేరుగా వాహనంలో డాక్టర్, సిబ్బంది వచ్చేవారు. జీవాలకు అవసరమైన చికిత్సలు చేసేవాళ్లు. ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు ఏదైనా జీవాలకు చికిత్స చేయించాలంటే పశువుల ఆసుపత్రికే తీసుకువెళ్లాలి. సంచార వాహనాన్ని కొనసాగించాలి.

-రామాంజనేయులు, విడపనకల్లు

కాంట్రాక్టు పూర్తి కావడంతో ఆపేశారు

కాంట్రాక్టు కాలం పూర్తి కావడంతో తొలి విడతకు చెందిన సంచార పశుసేవా వాహనాలను నిలిపివేశారు. ఆయా వాహనాల్లో పనిచేస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది తిరిగి వాహనాలను ఏర్పాటు చేసి, తమకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతిపత్రం అందించారు. రైతుల నుంచి కూడా సంచార వాహనాలను పంపాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం.

-వెంకటస్వామి, జేడీ, పశుసంవర్ధక శాఖ

గరుడ వాహన విహారి

- అలరించిన ఖాద్రీశుడి వేడుక
- నేడు శ్రీదేవి భూదేవి సమేతుడై.. శేష వాహనంపై విహారం


బ్రహ్మగరుడ సేవలో స్వామివారు...

కదిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం ఉన్న బ్రహ్మగరుడ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. యాగశాలలో శ్రీవారికి ఉదయం నిత్యపూజ నిర్వహించి, తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం గరుడ వాహనంపై తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు వేదపండితులు గరుడ పూజను నిర్వహించారు. గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీవారిని తూర్పు రాజ గోపురం నుంచి దర్శించుకుంటే మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం, తిరు వీదులు కిక్కిరిసిపోయాయి. శ్రీవారికి ఊరేగింపు ముందు జానపద కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలలో శనివారం శేష వాహన సేవ నిర్వహిస్తారు. అన్ని వాహన సేవల్లో శ్రీవారు మాత్రమే తిరువీదులలో భక్తులకు దర్శనమిస్తారు. కానీ శేష వాహన సేవలో శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు తిరువీధుల్లో విహరిస్తారు.

కదిరి పున్నమి

కదిరి పున్నమిని పురస్కరించుకుని శ్రీవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏపీ, కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి మొక్కులను తీర్చుకున్నారు.

నేడు కదిరికి కొక్కంటి జ్యోతి


కొక్కంటి జ్యోతి (ఫైల్)

తనకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా కొక్కంటి పాలేగాళ్ల ఆధ్వర్యంలో నిర్వహించే కొక్కంటి జ్యోతి కార్యక్రమం శనివారం తెల్లవారుజామున మొదలవుతుంది. కదిరికి సాయంత్రంలోపు చేరుకుంటుందని కొక్కంటి పాలేగాడు వైవీ దినకర్‌నాయుడు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోందని తెలిపారు. కొక్కంటి పాలేగాళ్ల ఇంటిలో జ్యోతికి శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి క్షేత్రం మీదుగా కదిరికి చేరుకుంటుంది. తనకల్లు, నల్లచెరువు, అన్నమయ్య జిల్లా ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లి మండలాల భక్తులు కాలినడకన కదిరి బ్రహోత్సవాలకు వెళ్లి, జ్యోతి కార్యక్రమంలో పాల్గొంటారు.



సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం



మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..

క్రైం కార్నర్

పండగపూట పుత్ర శోకం

- బావిలో పడి విద్యార్థి మృతి



పునీత్‌కుమార్ మృతదేహం

రాప్తాడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగినేపల్లికి చెందిన విద్యార్థి పామళ్ల పునీత్‌కుమార్ (8) శుక్రవారం బావిలో పడి మృతిచెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... పామళ్ల నారాయణ స్వామి, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు పునిత్ కుమార్ కనగానపల్లి మండలం తగరకుంటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. హోలీ పండుగ సందర్భంగా పాఠశాలకు శుక్రవారం సెలవు కావడంతో పునిత్ కుమార్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి మధ్యాహ్నం పొలాల వద్దకు వెళ్లారు. రైతు శివయ్య పొలంలో బావి వద్ద చెట్ల గూడులో పావురాల గుడ్లు ఉండటంతో వాటిని తీసుకునేందుకు ముగ్గురు వెళ్లారు. పునిత్‌కుమార్ ముందువైపు ఉండటంతో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడ్డాడు. పునిత్ కుమార్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. తోటి విద్యార్థులు వెంటనే గ్రామంలోకి వెళ్లి పునిత్‌కుమార్ బావిలో పడ్డాడని గ్రామస్థులు, కుటుంబ సభ్యులకు తెలిపారు. గ్రామంలోని వ్యక్తులు హుటాహుటిన బావి దగ్గరకు వెళ్లారు. పునిత్‌కుమార్ కోసం బావిలో గాలించగా కనిపించకపోవడంతో అగ్నిమాపక, విపత్తుల శాఖ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చారు. అసిస్టెంట్ డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ లింగమయ్య, ఫైర్ మెన్‌లు గోవిందరాజులు, శ్రావణ్‌కుమార్, జయరాముడు, తిప్పేస్వామి, అజయ్‌కుమర్‌లు బావిలో దిగి పునిత్‌కుమార్ మృతదేహంను బయటలకు తీశారు. తమ ఏకైక కుమారుడు మరణించడంతో పునిత్ కుమార్ తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. రాప్తాడు సీఐ శ్రీ హర్ష సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

19 నుంచి న్యాయ విద్య పరీక్షలు

అనంతపురం సెంట్రల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో న్యాయ విద్య కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ నెల 19 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ తెలిపారు. ఎల్ఎల్‌బీ మూడు, ఐదు సంవత్సరాల విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిమర్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ నెల 19 నుంచి 24వరకు ఆరు రోజులపాటు నిర్వహించే పరీక్షలకు దాదాపు 1,050 మంది విద్యార్థులు హాజరౌతారని తెలిపారు.

వైసీపీలో అలజడి.!

రాయదుర్గంలో నలుగురు కౌన్సిలర్లు, ఇద్దరు నాయకుల సస్పెన్షన్

- పార్టీకి రాజీనామా దిశగా మరికొందరు..
- మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా పావులు



మాట్లాడుతున్న బహిష్కృత కౌన్సిలర్లు, నాయకులు

రాయదుర్గం, మార్చి14(ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఒక్కసారిగా అలజడి రేగింది. పట్టణానికి చెందిన నలుగురు కౌన్సిలర్లతోపాటు ఇద్దరు సీనియర్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం దుమారం రేపింది. రాయదుర్గం వైసీపీలో ఇటీవల అసమ్మతి బలపడుతూ వస్తోంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వేదికగా రెండువర్గాలుగా విడిపోయి, తన్నుకునే స్థాయికి చేరారు. దీనిని సీరియస్‌గా పరిగణించిన అధిష్ఠానం సస్పెన్షన్‌తో క్రమశిక్షణ చర్యలకు శ్రీకారం చుట్టింది. మరికొందరిని త్వరలోనే సస్పెండ్ చేయనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాయదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసులుయాదవ్, వలి, కౌన్సిలర్లు డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేశారు. డీ.హీరేహాళ్ మండల మాజీ కన్వీనర్ వన్నూరుస్వామి, రాళ్ల తిమ్మారెడ్డిని కూడా సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. శాసనసభ ఎన్నికల అనంతరం నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి ఒక్కసారిగా భగ్గుమంది. నాలుగేళ్లపాటు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన పొరాళ్ల శిల్పను గద్దె దింపడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. దీని కోసం నాలుగు నెలలుగా తీవ్ర కసరత్తు సాగుతోంది. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి చేరవేస్తూ వస్తున్నారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో 14 మంది సభ్యులు జట్టుగా ఏర్పడి కోరంలేకుండా చేసి చైర్‌పర్సన్‌ను గద్దె దింపే ప్రయత్నానికి పూనుకున్నారు. రెండు వర్గాలుగా ఏర్పడి వాగ్వాదం చేసుకోవడంతోపాటు తన్నుకునే స్థాయికి చేరారు. దీంతో వైసీపీ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. మున్సిపల్ కౌన్సిల్‌లో 32 మంది సభ్యుల్లో 29 మంది వైసీపీకి చెందిన వారున్నారు. వీరిలో 14 మందిదాకా తిరుగుబాటు చేస్తున్నారు. అధిష్ఠానం బుజ్జగించే చర్యలు చేపట్టినా వారు వెనక్కి తగ్గలేదు. పైగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న శిల్పను గద్దె దింపడానికి వైస్ చైర్మన్ వలి.. కొందరికి సొమ్ము చెల్లించి, తన వైపు తిప్పుకుంటున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా రెండు వర్గాలుగా ఏర్పడి, ఎవరికి వారు ఎత్తుగడలు వేస్తున్నారు. డీ.హీరేహాళ్ మండల మాజీ కన్వీనర్ వన్నూరుస్వామితోపాటు సీనియర్ నాయకుడు రాళ్ల తిమ్మారెడ్డి.. బీజేపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారంటూ చర్యలు తీసుకుంది. అసమ్మతి వర్గం.. వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ వస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సస్పెన్షన్ ఎలాంటి పరిణామాలకు తావిస్తుందోనన్న చర్చలు వినిపిస్తున్నాయి.

రాజీనామాకు సిద్ధంగా 8 మంది కౌన్సిలర్లు

తమపై చర్యలు తీసుకోవడంతో వైసీపీకి తీవ్ర నష్టం తప్పదని బహిష్కృత కౌన్సిలర్లు తెలిపారు. వైస్ చైర్మన్ వలి, శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్లు డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డి, వన్నూరుస్వామి విలేకరులతో మాట్లాడారు. మరికొందరు కౌన్సిలర్లు, నాయకులు కూడా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. సస్పెన్షన్లతో పార్టీకి మరింత నష్టం తప్పదన్నారు. ఇంకా ఎనిమిది మంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు వెల్లడించారు. రాజీనామాకు సంబంధించి సంతకాలు చేసిన లేఖను చూపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను మార్చాలని 14 మంది కౌన్సిలర్లు.. సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని పలుమార్లు కోరామన్నారు. ప్రయోజనం లేదన్నారు. మెట్టు గోవిందరెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గద్దె దింపడం ఖాయమనీ, అవిశ్వాసం పెట్టి తీరుతామని వారు స్పష్టం చేశారు.

చట్టంపై చైతన్యం పెరగాలి

వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత



అనంతపురం క్రైం, మార్చి14(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రజల్లో చైతన్యం రావాల్సిన ఉందని వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత అన్నారు. అప్పుడే చట్టం లక్ష్యం నెరవేరుతుందన్నారు. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ప్రకటన విడుదల చేశారు. నాణ్యతలేని ఉత్పత్తులు, తప్పుడు ప్రకటనలు, అధిక ధరలు, సరైన సేవలు అందకపోవడం తదితరాల్లో పరిహారం కోసం వినియోగదారుల రక్షణ చట్టం-2019 అమలులో ఉందన్నారు. దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ఉత్పత్తులు, సేవలతో నష్టపోతే పరిహారం పొందే హక్కు ఉందన్నారు. రూ.కోటిలోపు కేసులు జిల్లా కమిషన్ ఎదుట, రూ.కోటి-రూ.10కోట్ల పైబడిన కేసులు జాతీయ కమిషన్ ఎదుట దాఖలు చేయవచ్చన్నారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. నాణ్యతలేని ఉత్పత్తులకు తయారీదారులు, విక్రయదారులు, సేవాదారులందరూ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రెండేళ్ల కాలపరిమితికి లోబడి కమిషన్ ఎదుట ఫిర్యాదులు దాఖలు చేయవచ్చని ఆమె వివరించారు.

17న జాబ్‌మేళా

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పలు కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఈనెల 17వ తేదీన స్థానిక ఆర్టీటీ స్టేడియం ఎదురుగా ఉప్పరపల్లి రోడ్డులోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, టాటా స్టైవ్, ఎంఎస్ఎన్ ఫార్మా లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంకాం చదివిన యువతీయువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి స్టైఫండ్‌తో కూడిన ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 8328368554, 9000024919, 9182063878 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని వివరించారు.

స్టీల్ ప్లాంట్‌కు గనులు.. నిధులు ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం గనులు, నిర్వహణ నిధులు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఓబులు మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తామని కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు ఎన్నికల ముందు హామీ ఇచ్చాయన్నారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ జనవరి 29న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి, ప్యాకేజీ ప్రకటించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులను అప్పులు తీర్చడానికే ఉపయోగించాలనీ పేర్కొనడం సరికాదన్నారు. కార్మికుల జీతాలు, ముడిసరుకు కొనుగోలు, నిర్వహణ పరికరాలు కొనేందుకు వినియోగించరాదని ప్రకటించారన్నారు. దీనిని బట్టి ప్యాకేజీ నిధులతో అప్పులు తీర్చి, ప్రైవేటు వారికి అప్పులులేని ప్లాంట్‌ను ధారాదత్తం చేయాలనే కుట్ర స్పష్టమవుతోందని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రధాన సమస్య సొంత గనులు లేకపోవడమేనన్నారు. నాణ్యమైన స్టీల్ ఉత్పత్తి చేస్తున్న ప్లాంట్‌కు సొంత గనులు ఎందుకివ్వరని ప్రశ్నించారు. సొంతగనులు ఉన్న ప్లాంట్‌కు టన్ను రూ.వెయ్యిలోపు ముడి ఇనుప ఖనిజం దొరుకుతోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మాత్రం మార్కెట్‌లో టన్నుకు రూ.6వేల నుంచి రూ.8వేల వరకు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ఈ భారమే ప్లాంట్‌ను కుంగదీస్తోందన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్, ఆటో కార్మిక నేతలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు

పన్ను కట్టకపోతే కొళాయి కట్

● రూ.లక్షకు పైగా ఉన్న బకాయిలపై చర్యలు ● నెలాఖరులోపు చెల్లించండి: కమిషనర్

అనంతపురం క్రైం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లించకుండా బకాయిలున్న వారికి అధికారులు ఝలక్ ఇచ్చారు. రూ.లక్షకు పైగా పన్ను పెండింగ్‌లో ఉన్న వారికి నీటి కొళాయి కనెక్షన్ కట్ చేశారు. నగరపాలక సంస్థ ద్వారా తాగునీటి సరఫరా చేసే పైపులను తొలగించారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో రెవెన్యూ విభాగం అధికారుల ఆధ్వర్యంలో నీటి కొళాయి కనెక్షన్లను కట్ చేశారు. ఇదే సందర్భంగా నగర కమిషనర్ బాలస్వామి పన్ను బకాయిదారులకు ఓ సూచన చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పన్ను చెల్లింపులకు మరో 17 రోజులు మాత్రమే ఉండటంతో బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగర ప్రజలు ఈనెలాఖరు వరకు వేచి చూడకుండా ముందుగానే పన్నులను చెల్లించాలని, నెలాఖరులో సర్వర్ ఆన్‌లైన్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుందన్నారు. బకాయిదారులపై చట్టపరమైన చర్యలు, నీటి కొళాయి తొలగించడానికి యాక్షన్ ప్లాన్ చేశామన్నారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా సెలవు రోజులు, ఆదివారాల్లో కార్పొరేషన్‌లో ప్రత్యేక కౌంటర్లు ఉదయం 8గంటల నుంచి రాత్రి 7గంటల వరకు పనిచేస్తాయన్నారు. ఆస్తిపన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ తెలిపారు.


నీటి కొళాయి కనెక్షన్లు కట్ చేయిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

వినికిడి యంత్రాలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

రామగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో వినికిడి లోపం ఉన్న విద్యార్థులు ఉండరాదని, ఇచ్చిన వినికిడి లోపం యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. రామగిరిలో శుక్రవారం దీనదయాల్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి లోపం ఉన్న వారికి యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కొద్దిరోజుల్లోనే 26 క్యాంపులు నిర్వహించారని 27వ క్యాంప్ రామగిరిలో ఏర్పాటు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పేదలు వినికిడి లోపం ఉన్నా యంత్రాలుతెచ్చుకునే శక్తి లేక అలాగే ఉండిపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు, సోలార్ ఎనర్జీ లిమిటెడ్ డీజీఎం వెంకటేశ్, అమర్‌రాజ మేనేజర్ అరవిందు, సాక్ష్యం జిల్లా కన్వీనర్ పవన్, జిల్లా మెడికల్ ఆఫీసర్ సోలామెన్, నాయకులు క్రిష్ణకిశోర్, రంగయ్య, పరంధామయాదవ్, సుధాకర్, రామ్మూర్తి నాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనాథ్, మారుతీప్రసాద్, శ్రీధర్‌నాయుడు, శ్రీనివాసులు, ఆంజనేయులు, అక్కులప్ప, శీన పాల్గొన్నారు. గంగంపల్లి తండాలో గిరిజనులతో కలిసి ఎమ్మెల్యే పరిటాలసునీత హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. సీసీరోడ్లను పరిశీలించి వీధిలైట్లను ప్రారంభించారు. గిరిజనుల మహిళల సాంప్రదాయ దుస్తుల్లో ఆమె గిరిజనులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పండుగ రోజు తండాకు వెలుగులు వచ్చాయన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి : సీపీఐ

అనంతపురం విద్య, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని, దీనిపై సీఎం చంద్రబాబునాయుడు స్పందించాలని సీపీఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ నాయకులు క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ... 32 మంది కమ్యూనిస్టుల బలిదానాలతో, కమ్యూనిస్టుల రాజీనామాలతో విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటయిందన్నారు. అలాంటి కర్మాగారం నేడు ప్రైవేటీకరణ అవుతోందన్నారు. లక్షలాది మంది ఉద్యోగాలు, ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి....ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా హాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, నాయకులు రాజారెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, పద్మావతి, రమణయ్య, అల్లిపీరా, సంతోష్‌కుమార్, రాజేష్‌గౌడ్, హనుమంతు, కుళ్లాయి, ఈశ్వరయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

ఎస్కేయూ మాజీ వీసీ అక్రమాలపై విచారణ చేయాలి

అనంతపురం విద్య, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ మాజీ వైస్ చాన్స్‌లర్ రామకృష్ణారెడ్డి అక్రమాలపై విజిలెన్స్ కమిటీతో విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. రామకృష్ణారెడ్డికి ఎలాంటి అర్హతలు లేకపోయినా రాజకీయ అండదండలతో వైస్ చాన్స్‌లర్‌గా వచ్చి యూనివర్సిటీని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. మూడేళ్ల కాలంలో యూనివర్సిటీలో కోట్లలో అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఫౌండేషన్ పేరుతో రూ.50 లక్షలు దుర్వినియోగం చేశారన్నారు. యువగళం పాదయాత్రలో ఎస్కేయూ వద్ద నారా లోకేశ్‌కు నాడు వీసీ అవినీతిపై ఫిర్యాదు చేస్తే...విచారణ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీ మేరకు విచారణ చేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, నరసింహయాదవ్, ఉమామహేష్, సమీర్, సాయి, హేమంత్, కార్తీక్, యశ్వంత్ పాల్గొన్నారు.

వైభవంగా వీర ఓబమ్మ జాతర

రామగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమేకలపల్లిలో శుక్రవారం వీర ఓబమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వీర ఓబమ్మకు, లక్ష్మీనరసింహస్వామికి, అక్కమ్మగార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వీర ఓబమ్మ దేవి ఎదుట దిబ్బాల మహాపూజ చేశారు. అనంతరం భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వాములకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్ ప్రత్యేకబందోబస్తు నిర్వహించారు. ఉట్లమాను కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారు, స్వాములను గ్రామంలో ఊరేగించారు.

'పోస్టులు పెట్టే సంస్కృతి మాకు లేదు'

అనంతపురం క్రైం,మార్చి 14(ఆంధ్రజ్యోతి): పోస్టులు పెట్టే సంస్కృతికి తమకు లేదని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతినాయుడు, జిల్లా అధ్యక్షుడు లేపాక్షి నాయుడు, జిల్లా నాయకులు బుడేన్‌సాబ్, నారాయణ శుక్రవారం కోర్టు ఆవరణంలో విలేకరులతో మాట్లాడారు. తాము ఎక్కడా పోస్టులు పెట్టలేదని, అది వైసీపీ వారికే చెల్లిందన్నారు. మీరే కోడి కత్తి కేసు, బాబాయి హత్య కేసు, గులకరాయి కేసు తరహాలో మీరే చేసుకుని ప్రజాదరణ కోసం ప్రైవేట్ కేసు వేస్తున్నారన్నారు. ప్రజాదరణ కోల్పోయి 11 సీట్లకు పరిమితమయ్యారన్నారు. అసభ్యకరంగా, తప్పుడు, నిరాధార కేసులు పెట్టి కోర్టు సమయాన్ని వృథా చేయడం సరికాదన్నారు.

మహాలక్ష్మీదేవికి పుష్పాభిషేకం

అనంతపురం కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఫాల్గుణ మాస పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాలక్ష్మీదేవి అమ్మవారికి పుష్పాభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవమూర్తికి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రబద్ధంగా పుష్పాభిషేకం చేశారు. అలాగే మహిళలు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు సామూహికంగా లక్షకుంకుమార్చనలు పాటించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం


నరసింహస్వామిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

కనగానపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపకుంట గ్రామంలో శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం కన్నుల పడువగా జరిగింది. గ్రామంలోని లక్ష్మీనరింహస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ఊరేగించారు. భక్తులకు వేపకుంట సుధాకర్‌చౌదరి అన్నదానం చేశారు.

ఉత్సాహంగా రాతిదూలం పోటీలు: మండలంలోని పాతపాళ్యం గ్రామంలో రాతిదూలం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. గ్రామంలోని మాదవరాజుల స్వామి పరుష సందర్భంగా సర్పంచ్ పూజారి రాజాక్రిష్ణ, పూజారి వేణు రాతిదూలం పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల్లో పులేటిపల్లి భాస్కర్‌రెడ్డి ఎద్దులు మెదటి బహుమతి, నంద్యాల హరినాథరెడ్డి ఎద్దులు రెండో బహుమతి సాధించాయి. గెలుపొందిన వారికి టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచ్ సోమర చంద్రశేఖర్, ఎంపీటీసీ బిల్లే భాస్కర్ బహుమతులు అందజేశారు.

పెట్రోల్ బంకు పేరుతో మోసంపై కేసు

అనంతపురం క్రైం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పెట్రోలు బంకు పేరుతో మోసం చేసి రూ.61లక్షలు డబ్బు తీసుకున్న ఘటనపై పడమల నాగేంద్ర అనే వ్యక్తిపై టూటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఆత్మకూరు మండలానికి చెందిన చిన్న సర్దానప్ప, చిన్న సర్దానప్ప, మరో మహిళ కలిసి నాగేంద్ర తమతో రూ.61లక్షలు తీసుకుని పె ట్రోల్ బంక్ వేయించలేదని ఈనెల 10వతేదీ ప్రజా సమస్యల పరిష్కా ర వేదికలో జిల్లా ఎస్పీని కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ఆ ఫి ర్యాదు ఆధారంగా బాధితులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు నాగేంద్రపై కేసు నమోదు చేశారు.

చీనీ కాయలు టన్ను రూ.24 వేలు

అనంతపురంరూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.23,750, కనిష్టంగా రూ.7,200, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 349 టన్నుల చీనీకాయలు వచ్చాయని పేర్కొన్నారు.

ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

అనంతపురం టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఎలక్ట్రీషియన్‌కు ప్రమాదం తప్పింది. చిన్నగాయాలతో బయటపడగా వార్డులో చేర్పి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి అధికారులు తెలిపిన మేరకు.. విద్యుత్ మరమ్మతులు చేస్తున్న ఎలక్ట్రీషియన్ నరసింహులు శుక్రవారం ఎంఆర్ఐ సెంటర్ వద్ద ఉన్న మరమ్మతులు చేస్తుండగా.. షాక్‌కొట్టి మంటలు రావడంతో చేతికి గాయాలయ్యాయి. వెంటనే సిబ్బంది నరసింహులుకు చికిత్సలు అందించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గార్లదిన్నె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడ్డాలపల్లికి చెందిన నలపరెడ్డి (75) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం కర్నూలు ఆస్పత్రిలో మృతి చెందాడు. వారం రోజుల క్రితం కనుంపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా పామిడి వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నలపరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమించడంతో కర్నూల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ : ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆరో రోడ్డులోని మసీదులో టీడీపీ నాయకుడు ఓంకార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మసీదులో ఉపవాస దీక్ష విరమణ ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు భోజనం వడ్డించారు. మసీదుకు అవసరమైన వంట సామాగ్రిని టీడీపీ నాయకుడు ఓంకార్‌రెడ్డి ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. తర్వాత బళ్లారి బైపాస్‌లోని ఆటో హబ్‌లో టీడీపీ నాయకుడు దాదు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.


భోజనంవడ్డిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్

హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ అయ్యేలా చూడండి

● అనంతపురం విద్య: నగరంలో విద్యార్థులు అధికంగా ఉన్న ప్రైమరీ, యూపీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలని పలు సంఘాల నాయకులు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కోరారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామాంజనేయులు, ఫణిభూషణ్, జనార్దన్, విరూపాక్షి, యుగంధర్, ప్రభాకర్, సురేష్, నరసింహులు, ఓబులేసు, భాగ్యరాజ్, నారాయణ నాయక్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్య పరిష్కారానికి అడుగులు

● అనంతపురంరూరల్: మూడు దశాబ్దాలుగా డంపింగ్ యార్డు సమస్యతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శాశ్వత పరిష్కారం చూపించే దిశగా అడుగులు వేశారని రాజీవ్ కాలనీ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. అసెంబ్లీలో డంపింగ్ యార్డు సమస్యను ప్రస్తావించి, పరిష్కారానికి చొరవ చూపిన సందర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యేని సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు హరి, దాదాపీర్, శోభ, సాదిక్, బాబు, ధనమూర్తి, మహబూబ్, నారాయణస్వామి, శివ, రమణ, రహీమ్, సావిత్రమ్మ, గోపాల్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

అనంతపురం సెంట్రల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పరిశోధన ప్రాజెక్టులను వ్యాపార సంస్థలుగా మార్చేలా సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య పేర్కొన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఐదురోజుల శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, అకడమిక్, ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సొంత కంపెనీలు నెలకొల్పి వ్యాపారా ప్రారంభించేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు వాద్వని ఫౌండేషన్, జేఎన్టీయూ, కళాశాల సంయుక్తాధ్వర్యంలో 'ట్రైన్ ది ట్రైనర్' అనే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వీబీ చిత్ర, నారాయణ రెడ్డి, సాంబయ్య, శ్యామ్‌రాజేష్, సరిత పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందజేస్తున్న రిజిస్ట్రార్ క్రిష్ణయ్య

న్యూస్ బాక్స్

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

చెన్నేకొత్తపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాదిండి సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏడాది కదిరి పున్నమిని పురస్కరించుకుని ఇక్కడ రెండురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. మొదటి రోజు స్వామిని ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

బాలుడి అప్పగింత

నార్పల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక చైతన్య కాలనీలో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మహీధర్ అనే బాలుడిని శుక్రవారం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. నార్పల ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ.. కాలనీలో ఉంటున్న మహీధర్ ఏడో తరగతి చదువుతున్నాడు. హోంవర్క్ రాయలేదని తల్లిదండ్రులు మందలించడంతో గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించనట్లు ఎస్ఐ తెలిపారు.

'ఎమ్మెల్సీ కేటాయింపుల్లో సామాజిక న్యాయం'

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీల పదవులు కేటాయింపులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామాజిక న్యాయం పాటించారని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కాపునాడు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మన్న శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనతో విసిగివేసారిన రాష్ట్ర ప్రజలు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపిం చి చరిత్రసృష్టించారని గుర్తుచేశారు. నాగబాబుకు మంత్రివర్గంలో చోటు కల్పించి, ఆయన సేవలను రాష్ట్ర వ్యాప్తం చేయాలని కోరారు.

తోపుదుర్తి ఆరోపణలు అవాస్తవం : ఎస్ఐ

రామగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఇటీవల విలేకరుల సమావేశంలో చేసిన ఆరోపణలు నిరాధారమైనవి, ప్రజలను తప్పుదోవ పట్టించడం మంచిదికాదని రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ కోసం పనిచేస్తున్నారని, రాప్తాడు ఎమ్మెల్యేకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించడం పూర్తీగా అవాస్తవమని పేర్కొన్నారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సమస్యలు రాకుండా వ్యవహరిస్తున్నానని అన్నారు. రాప్తాడులో తుపాకుల అంశంపై మాజీ ఎమ్మెల్యే మాట్లాడటం బాధాకరమన్నారు. గ్రామాల్లో ఎవరు గొడవలు సృష్టించాలని చూసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయం ఈఓగా శోభ


స్వామిని దర్శించుకుంటున్న ఈఓ

అనంతపురం కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా శోభ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ స్థానంలో ఉన్న రమేష్‌బాబును పెన్నహోబిలం రెగ్యులర్ ఈఓగా పరిమితం చేస్తూ, గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ఈఓగా ఉన్న శోభకు కాశీవిశ్వేశ్వరాలయం రెగ్యులర్ ఈఓగా బదిలీ చేస్తూ రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం శోభ కాశీవిశ్వేశ్వర స్వామిని దర్శించుకుని అనంతరం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించండి

శింగనమల మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పని సరిగా వేయిచాలని జిల్లా పశువైద్యాధికారి రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుమ్మేపల్లిలో పశువైద్యశాఖ ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి టీకాల శిబిరాన్ని ఆయన, సర్పంచ్ డేగల లలితమ్మ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగలకృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉచిత శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా పై డే

అనంతపురం సెంట్రల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో పైడేని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి ఉత్తమ ప్రతిభను కనబర్చిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రి న్సిపాల్ ప్రసాద్, వైస్ ఛైర్మన్ చక్రధరరెడ్డి, అధ్యాపకులు రవికుమార్, నరేష్‌కుమార్, శివతేజ, నజ్మాబేగం, గురుప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

అనంతపురం కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసంలో రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు సాధారణ రోజుల్లోనూ శుక్రవారం రోజును ఆధ్యాత్మికంగా పవిత్రమైన రోజుగా పరిగణిస్తారు. రంజాన్ మాసంలో వచ్చే శుక్రవారాలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నగరంలోని మసీదుల వద్ద పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఇఫ్తార్ స్వీకరించారు.

ఇందిరానగర్‌లో రోడ్డు వేయాలి : సీపీఎం

అనంతపురం కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని 49వ డివిజన్ పరిధిలో ఇందిరానగర్ మెయిన్ రోడ్డు వేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం డివిజన్‌లో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకోవడంతోపాటు రోడ్డు నిర్మాణాన్ని కోరుతూ ప్రజలచే సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరానగర్ మెయిన్‌రోడ్డును 1999లో సీసీ రోడ్డుగా వేశారని, ఇపుడు రోడ్డు గుంతలమయమై ప్రజలు, వాహనాలు తిరగడానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, ప్రసాద్, కాలనీ వాసులు పాల్గొన్నారు.


ఇందిరానగర్‌లో సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అర్బన్ అభివృద్ధే అజెండా..!

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'ఎవరెవరో ఏవేవో మాట్లాడుతున్నారు. అవన్నీ నేను పట్టించుకోను. అర్బన్ నియోజకవర్గం అభివృద్ధే నా అజెండా' అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ స్పష్టం చేశారు. నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఏడుగురు లబ్ధిదారులకు రూ.9.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆయన అందజేశారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటి దాకా తన నియోజకవర్గ ప్రజలకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.78 లక్షల సాయం అందజేశామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలలో తనకు రెండుసార్లు మాట్లాడే అవకాశం వచ్చిందని, నగరంలో ప్రధాన సమస్యలైన డంపింగ్ యార్డు తరలింపు, నడిమి వంక, మరువ వంకకు ఇరువైపులా ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ గురించి ప్రస్తావించానని తెలిపారు. అక్టోబరు 2లోపు డంపింగ్ యార్డును క్లియర్ చేసి చూపిస్తామని అన్నారు. నడిమి వంక, మరువ వంక ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణాన్ని రూ.88 కోట్లతో త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కూడా త్వరలోనే మంజూరవుతుందని, ఆ పనులు కూడా ప్రారంభిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అర్బన్ నియోజకవర్గంలో గత 15 సంవత్సరాల్లో జరగని అభివృద్ధిని ఏడు నెలల్లోనే చేసి చూపిస్తున్నామని అన్నారు. రుద్రంపేట రోడ్డు పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉందని, తాను గెలిచిన ఆరు నెలల్లోనే రోడ్డు వేయించానని అన్నారు. రూ.40 కోట్లతో నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. గడిచిన 40 ఏళ్లలో చేయని పనులను చేసి చూపిస్తామని అన్నారు. నగరాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా మార్చడమే తన ధ్యేయమని అన్నారు. ఆక్రమణకు గురైన నగరపాలక సంస్థ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, పార్కులు, కమ్యూనిటీ హాల్స్, పాఠశాలలు నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్తియార్, సైపుద్దీన్, గోపాల్ గౌడ్, స్వామిదాస్, హరి, శ్రీదేవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

పరిటాల నివాసంలో హోలీ సంబరాలు


హోలీ సంబరాల్లో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని పరిటాల నివాసంలో శుక్రవారం హోలీ పండుగను జరుపుకున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తమ కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి హోలీ సంబరాలు చేసుకున్నారు. పరిటాల సునీత తన మనవడు, మనవరాలికి రంగులు చల్లగా.. చిన్నారులు కూడా తన నాన్నమ్మకు రంగులు చల్లడం కనిపించింది.


అనంతపురం హౌసింగ్‌బోర్డు కాలనీలో చిన్నారుల కేరింతలు


● శింగనమల: మండలంలోని నాగులగుడ్డంతండాలో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తండావాసులు గ్రామదేవతకు పూజలు చేసి ఒక చోటుకు చేరి రంగులు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

ఆర్డీటీ పాఠశాలలను పునః ప్రారంభించాలి

అనంతపురం సెంట్రల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ఆర్డీటీ పాఠశాలలను పునః ప్రారంభించాలని ఆ సంస్థ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధికార ప్రతినిధి అక్కులప్ప కోరారు. ఈ మేరకు శుక్రవారం డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు గంటలపాటు పాఠశాలలు నిర్వహించి అనేక మంది విద్యార్థులకు పాఠాలు బోధించేవారన్నారు. అదేవిధంగా, రాత్రి వేళల్లో నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించి విజ్ఞాన వెలుగు నింపారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హనుమన్న, లక్ష్మినారాయణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న జనసేననాయకులు

గుత్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కేక్ చేశారు. అలాగే స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, మండల కార్యదర్శి నాగయ్య, నాయకులు అశ్వనాగప్ప, హేమంత్, కుళ్లాయప్ప, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్లు ఇవ్వలేదు

విడపనకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల వద్ద నుంచి తాము ఎలాంటి వసూళ్లు చేయలేదని, అక్రమ విద్యుత్ కనెక్షన్లు కూడా ఇవ్వలేదని విద్యుత్ ఏఈ సత్యం, లైన్‌మన్ రామానాయుడు పేర్కొన్నారు. మండలకేంద్రంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ (దండోరా) నాయకుడు కెంగూరి ఎర్రిస్వామి తాము నాన్ ఆయకట్టుదారులకు విద్యుత్ అక్రమ కనెక్షన్లు ఇచ్చామంటూ చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు సీనియారిటీ ప్రకారమే విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు చెప్పారు. దండోరా నాయకుడు అసత్య ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఏ ఒక్క రైతుతో అయినా డబ్బులు తీసుకుని అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి ఉంటే నిరూపించాలని అన్నారు.

మహాలక్ష్మి దేవికి ప్రత్యేక పూజలు


పెన్నహోబిళంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉరవకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మీ దేవి జయంత్యుత్సవాలను మండలంలోని పెన్నహోబిలంలో గల ఉద్భవ లక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పొందారు.

గుంతకల్లుటౌన్: మండలంలోని కసాపురం గ్రామంలో గల లక్ష్మీనారాయణస్వామి రాతి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మహిళలు సౌభాగ్య కుంకుమార్చన చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకిలో కొలువు దీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తలారి పరుశురాముడు భక్తులు పాల్గొన్నారు.

రథం తయారీకి విరాళాలు


నగదు అందజేస్తున్న అంకె రమేష్

కూడేరు, మార్చి 14, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జోడులింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి నూతన రథం తయారీ కోసం దాతలు విరాళాలను అందిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానికులు అయిన పాటిల్ వియజభాస్కర్‌రెడ్డి రూ.55,555, అంకె రమేష్ రూ.25,116 చొప్పున నగదును అర్చకుడు మహేష్, రథం కమిటీ సభ్యులకు అందజేశారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం

గుంతకల్లు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో గల రాఘవేంద్రస్వామి సన్నిధానం సమీపంలో నూతనంగా నిర్మించిన సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం హోలీ పండుగను పురస్కరించుకుని స్వామి వారి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత స్వామిమూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత గణపతి, నవగ్రహ పూజ జరిపారు. తర్వాత శాస్త్రోక్తంగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ఎన్ రవి, కార్యదర్శి రాజారామ్, కోశాధికారి ఎల్ కృష్ణ, సభ్యులు మౌళి, సురేష్, పద్మానాభశర్మ, తదితరులు పాల్గొన్నారు.

శివుడికి ప్రత్యేక పూజలు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కసాపురం రోడ్డులో భవాని ఆలయం వెనుక కాలనీలో గల శివాలయంలో హోలీ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు లోక్‌నాథ్ శర్మ స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగంశెట్టి విశ్వనాథ్, కార్యదర్శి రాజు, వీహెచ్‌పీ మండల కార్యదర్శి బిందు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

గుత్తిరూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామశివారులో చెరువు కట్టపై వెలసిన యాదుల్లా బాషా దర్గా 174వ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. దర్గా వద్దకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసి చక్కెర చదివింపులు చేయించారు. నిర్వాహకులు రాత్రికి ఆర్కెస్ట్రా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున పాత్తపేట నుంచి గుర్రంపై చంషీర్‌ను దర్గావద్దకు ఊరేగింపుగా తీసుకొస్తారు. తర్వాత జియారత్‌తో ఉరుసు ముగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పశుబీమాపై అవగాహన కల్పించాలి

బెళుగుప్ప, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులకు పశుబీమాపై అవగాహన కల్పిస్తూ, గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశులు, పశువైద్యుడు రమేష్ సిబ్బందికి సూచించారు. మండలంలోని వీరాంజనేయ కొట్టాల, నరసాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించి పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు టీకాలు ఎన్ని పశువులకు వేశారంటూ రికార్డులు పరిశీలించారు. తర్వాత మాట్లాడుతూ.. పశువైద్యసిబ్బంది పశువులకు టీకాలు వేయడంతో పాటు రైతులకు పశుబీమాపై అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది ఎర్రిస్వామి, రవితేజ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంబదూరులోకి కేఎస్‌ఆర్టీసీ బస్సులను నడపాలి

● టీడీపీ నాయకుల ఆందోళన

కంబదూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్టీసీ బస్సులను కంబదూరు మండలకేంద్రంలోకి నడపాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పాత పెట్రోల్ బంకు ఎదుట కేఎస్‌ఆర్టీసీ బస్సును నిలిపివేసి ఆందోళనకు దిగారు. పలువురు మాట్లాడుతూ.. కేఎస్ ఆర్టీసీ బస్సులు మండలకేంద్రంలోపలికి రాకుండా ఊరి బయటే ప్రధాన రహదారిలో కళ్యాణదుర్గానికి వెళుతున్నాయని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. ఇక నుంచి కేఎస్‌ఆర్టీసీ బస్సులను కంబదూరులోపలికి నడపాలన్నారు. దీంతో డ్రైవర్లు ఒప్పుకోవడంతో గ్రామంలోకి బస్సులు తిప్పారు. ఈ విషయాన్ని కేఎస్‌ఆర్టీసీ డిపో యాజమాన్యం దృష్టికి కూడా టీడీపీ నాయకులు, గ్రామస్థులు తీసుకెళ్లారు.


కేఎస్‌ఆర్టీసీ బస్సు ఎదుట ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

మిన్నంటిన హోలీ సంబరాలు

జేసీ పార్కులో వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్


హోలీ వేడుకల్లో యువకుల మధ్య ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి


జేసీపీఆర్‌కు రంగులు పూస్తున్న మహిళ


జీపులో విహరిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

తాడిపత్రి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేసీపార్కులో శుక్రవారం నిర్వహించిన హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. వేడుకలకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చిన్నారులతో, యువతతో కలిసి రంగులు చల్లుకుంటూ.. కేరింతలు కొడుతూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. సంబరాల్లో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. అనంతరం జేసీ ప్రభాకర్‌రెడ్డి స్వయంగా జీపు డ్రైవింగ్ చేయగా.. పక్కసీట్లోనే ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి కూర్చున్నారు. అలాగే వెనుక వైపు చిన్నారులను ఎక్కించుకుని జీపును మెయిన్‌బజారు, నవరంగ్‌టాకీస్ రోడ్డు, పోలీస్‌స్టేషన్‌రోడ్డు, సీబీ రోడ్డు తదితర ప్రాంతాల్లో విహరించారు. తండ్రి, కుమారుడు ఒకే జీపులో కూర్చొని ప్రజలకు అభివాదం తెలుపుతూ ముందుకు వెళ్లారు.

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలు హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని వీధుల్లో పెద్దలు, చిన్నారులు, యువకులు, మహిళలు ఒకరిపైఒకరు ఉత్సాహంగా రంగుల నీళ్లు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువత కేరింతలు కొట్టారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 39మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.31.97 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు లబ్ధిదారులకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో గల తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేగాటి నాగరాజు, వలి, వశికేరి రమేష్, మాజీ ఎంపీటీసీ నాగన్న, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

బెళుగుప్ప/కూడేరు: మండలంలోని కాలువపల్లికి చెందిన మారెక్కకు 49,258 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఇం దుకు సంబంధించిన చెక్కును టీడీపీ నేత ప య్యావుల శ్రీనివాసులు అందజేశారు. ఇక కూ డేరు మండలంలో ముద్దలాపురం గ్రామానికి చెందిన మాల రామానందకు రూ.1,64,273, జల్లిపల్లికి చెందిన దివ్యకు రూ.63,781, బైరెడ్డి మారుతీకుమార్‌రెడ్డికి రూ.91.343, కే.రాముకు రూ.1,92,350, ఉదిరిపికొండకు చెందిన కొర్రపాటి శకుంతలమ్మకు రూ.78,831, ఇప్పేరుకు చెందిన మంజులకు రూ.30.028, పి. నారాయణపురానికి చెందిన బోయ నవ్యకు రూ.20,393, సౌమ్యకు రూ.70,681, శివరాంపేటకు చెందిన గొర్ర ఎర్రిస్వామికి రూ.49.077, కూడేరుకు చెందిన శివశంకర్‌నాయుడుకు రూ.1,29,206, హంసపల్లికి చెందిన వేలూరు రాధకు రూ. 77,400 మేర చెక్కులను అందజేశారు.

చలివేంద్రాల ప్రారంభం


బెస్తరపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జనసేన మండల అధ్యక్షుడు కురువ పురుషోత్తం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన జనసేన నాయకులను అభినందించారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు శీన, నందీశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, జిల్లా కార్యదర్శి ముండ్లకేశవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద మండల కమ్మ సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్‌కమిషనర్ జబ్బార్‌మియా, సీఐ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కమ్మ సేవాసంఘం మండల అధ్యక్షుడు సురేంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జుననాయుడు, గౌరవ అధ్యక్షుడు కేశన్న, యంగన్నపల్లి సర్పంచు భరత్, ఎంపీటీసీ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లిలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో స్థానిక తెలుగు యువత నాయకులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పిలుపు


రాళ్ల అనంతపురంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కంబదూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య కోరా రు. మండలంలోని రాళ్లఅనంతపురం, నూతిమడుగు గ్రామాల్లో శుక్రవారం నాటుసారా నిర్మూలనపై కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగమద్దయ్య మాట్లాడుతూ నాటుసారాను అమ్మ డం నేరమన్నారు. నాటుసారా తాగడం వల్ల కలిగే అనారోగ్యాల గురించి వివరించారు. నాటుసారాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు అందరం ఒక్కటిగా ముందుకు సాగుదామంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి రామ్మోహన్‌రెడ్డి, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జయనాథ్‌రెడ్డి, సీఐ సునీల్ కుమార్, ఎస్‌ఐలు శ్రీనివాసులు, ప్రవీణ్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, వీఆర్వోలు, ఆశా కార్యకర్తలు, సర్పంచులు, ఆయా గ్రామస్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: నాటుసారా నిర్మూలించేందుకు ప్రజల భాగస్వామ్యం కావాలని ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కెంచానపల్లి గ్రామంలో ఆయన నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి నాటుసారా వల్ల కలిగే దుష్ఫలితాల గురించి వివరించారు. నాటుసారాను నిర్మూలనకు గ్రామస్థులందరూ సహకరించాలని కోరారు. ఎస్‌ఐ పవన్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా భంభం బాబా ఉరుసు

కుందుర్పి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో భంభం బాబా ఉరుసును గ్రామస్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్థానిక భంభం బాబా ఆశ్రమంలో నిర్వాహకులు ప్రత్యేక పూజలను ఆధ్యాత్మిక వారసుడు కబీర్ కిరణ్ స్వామి ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం ప్రత్యేక వాహనంలో కబీర్ కిరణ్ స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. వేలాదిమంది మహిళలకు బోనాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. తర్వాత ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభకు భక్తులు, గ్రామస్తులు భారీగా హాజరయ్యారు. అక్కడ ఉచిత వివాహాలు, కేశఖండన, భజన, గురుపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే అమిలినేని ఆధ్వర్యంలో భక్తులకు లడ్డు, మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు ధర్మతేజ, అమిలినేని ఎర్రిస్వామి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు

కంబదూరు: మండలంలోని ఐపార్శపల్లిలో భం భం బాబా ఆరాధనోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తొలుత స్థానిక ఆశ్రమంలో భం భం బాబా, అన్వరానందస్వామి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు, గురుపూజ చేశారు. అనంతరం భజనలు చేస్తూ ఆ చిత్రపటాలను ఊరేగించారు. పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.


కుందుర్పిలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బసంపల్లిలో కేబుల్ చోరీ

శెట్టూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రక్షిత మంచినీటి పథకం బోరు మోటారుకు సంబంధించిన కేబుల్‌ను కత్తిరించి ఎత్తుకెళ్లారు. దీంతో విద్యుత్ సరఫరా లేక గ్రామం లో తాగునీటి సమస్య ఏర్పడింది. గత రెండు రోజుల క్రితం చింతర్లపల్లిలో కూడా ఇదే విధంగా కేబుల్‌ను దుండగులు చోరీ చేశారని గ్రామ సర్పంచ్ గౌరమ్మ తెలిపారు. దుండగుల ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు పోలీసులను కోరారు.

ఓబుళాపురం సర్పంచ్‌పై కేసు నమోదు

గుంతకల్లు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం పంచాయతీకి చెందిన వైసీపీ మద్దతు సర్పంచ్ రమేష్‌రెడ్డిపై కసాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామ సచివాలయానికి సంబంధించిన బిల్లుల గురించి ఈనెల 12వ తేదీన సర్పంచ్ రమేష్ రెడ్డి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈ ఓబులేసుతో వాగ్వాదానికి దిగి దుర్భాషలాడాడు. దీంతో కసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎంఈ ఓబులేసు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు సర్పంచ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు.

మహిళను బెదిరించి.. దోపిడీ

తాడిపత్రి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చుక్కలూరు రోడ్డులో వెంకటేశ్వరమ్మ అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తి బెదిరించి ఆమెవద్ద ఉన్న రూ.10వేలు నగదును ఎత్తుకెళ్లాడని రూరల్ పోలీసులు తెలిపారు. వెంకటేశ్వరమ్మ స్థానిక నల్లబండల పరిశ్రమలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేది. కాగా శుక్రవారం ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ఒక్కసారిగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి బెదిరింపులకు గురిచేసి ఆమె వద్ద నుంచి డబ్బును ఎత్తుకెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

పొట్టేలు అపహరణ..

మండలంలోని యర్రగుంటపల్లి గ్రామ సమీపంలో తోట వద్ద రెండురోజులక్రితం పొట్టేలును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని రైతు మనోహర్‌రెడ్డి తెలిపారు. తోటవద్ద మేత మేస్తున్న పొట్టేలును ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఎత్తుకొని వేగంగా వెళ్లారన్నారు. గమనించిన తాను మరొకరితో కలిసి వెంబడించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు చెప్పాడు.

సచివాలయ ఉద్యోగి మృతి

ఉరవకొండ, మార్చి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌకుంట్ల సచివాలయం-2లో మహిళా పోలీస్‌గా పని చేస్తున్న నర్మద(30) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. గత కొంత కాలంగా బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మృతి చెందారు. ఆమె మృతి పట్ల సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలిపారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

● విచ్చలవిడిగా చెట్ల నరికివేత
● పట్టించుకోని అధికారులు


వాహనంలో బళ్లారికి తరలుతున్న కలప

బొమ్మనహాళ్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో పచ్చని చెట్లను వి చ్చలవిడిగా నరికేసి కలపను వివిధ వాహనాల్లో యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో రోజురోజుకూ చెట్లు కనుమరుగు అవుతున్నాయి. ప్రతిరోజూ బళ్లారి ప్రాంతానికి లారీ, ఐషర్ వాహనాలలో టన్నులకొద్దీ కలప తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. యథేచ్ఛగా కలప తరలిస్తున్నా అటవీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వాల్టా చట్టానికి తూట్లు పొడిచి మరీ వ్యాపారాలు చేస్తున్నారంటే అధికారులు ఏ మేరకు వ్యాపారులతో లాలూచీ పడ్డారో అర్థం చేసుకోవచ్చు. ప్రతిరోజూ అక్రమార్కులు కళ్యాణదుర్గం రహదారిపైనే బళ్లారి ప్రాంతానికి కలపను తరలిస్తున్నారు. చెట్లను నరకాలంటే అటవీ, రెవెన్యూశాఖలతో పాటు సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంది. అవేవీ లేకుండా కొందరు అక్రమార్కులు చెట్లను నరికేస్తూ కలపను తరలిస్తున్నారు. వారికి అధికారుల అలసత్వం వరంగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని మొక్కలు నాటినా ఏమి ప్రయోజనం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెట్ల నరికివేతను, కలప అక్రమరవాణాను అరికట్టాలని వారు కోరుతున్నారు.

దానిమ్మ చెట్లు దగ్ధం


కాలిపోయిన దానిమ్మ చెట్లు

రాయదుర్గంరూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జుంజురంపల్లి గ్రామంలో రైతు మరం తిప్పేస్వామికి చెందిన దానిమ్మతోట శు క్రవారం దగ్ధమైంది. తోట పై వెళ్లిన 33 కేవీ విద్యుత్ వైర్లు టచ్ కావడంతో నిప్పు రవ్వలు పడి మంటలు చెలరేగాయని, దీంతో చెట్లు దగ్ధమయ్యాయని బాధిత రైతు తెలిపాడు. నాలుగు ఎకరాల్లో చెట్లు దగ్ధమయ్యాయని, బిందు సేద్య పరికరాలు కూడా బూడిదయ్యాయని వాపోయాడు. లక్షలు ఖర్చు పెట్టి కాపాడుకుంటూ వస్తున్న దానిమ్మచెట్లు కళ్లెదుటే కాలిపోవడంతో కన్నీరుపెట్టాడు. దాదాపు రూ. 9 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

కూలీల వలసలను నివారించాలి

ఉరవకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కూలీల వలసలను నివారించి, తక్షణమే వారికి ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే ఉపాధి పనులు చేసిన కూలీలకు బిల్లులు పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయటానికి కుట్ర జరుగుతోందన్నారు. కూలీలందరూ ఐక్యంగా అడ్డుకోవాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. పనులు లేక కూలీలు జీవనోపాధి కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలన్నారు. కూలీలకు పనులు కల్పించి సకాలంలో బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రోజు కూలి రూ.700లు ఇవ్వాలని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకుడు మల్లేష్ పాల్గొన్నారు.

తెగి పడిన విద్యుత్ తీగ.. తప్పిన ప్రమాదం

తాడిపత్రి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల వెంకటరమణ స్వామి ఆలయ సమీపంలో శుక్రవారం విద్యుత్‌స్తంభం నుంచి మెయిన్ లైనుకు సంబంధించి విద్యుత్ తీగ తెగిపడింది. ఆ సమయంలో అక్కడ ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఆలయ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం మీదుగా ఉన్న విద్యుత్ తీగ ఒకటి మధ్యాహ్న సమయంలో ఉన్నట్లుండి తెగిపడింది. అదృష్టవశాత్తూ ఒక్కరూ కూడా అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ రహదారి నుంచే బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే మధ్యాహ్న సమయం కావడంతో ఎవరూ రాలేదు. విద్యుత్‌లైను తెగిపడడంతో స్థానికులే అక్కడ ఉండి వచ్చి అరకొరగా వచ్చి వెళ్లే వారికి సూచనలు ఇస్తుండడం కనిపించింది. సమాచారం అందించిన అరగంటకు ట్రాన్స్‌కో సిబ్బంది వచ్చి లైనును ఆఫ్‌చేసి తీగను సరిచేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

విషపునీరుతాగి జీవాల మృతి

రాయదుర్గంరూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విషపు నీరు తాగి ఎనిమిది గొర్రెలు, రెండు మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని కదరంపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. 20 జీవాలను గ్రామ సమీపంలోని మేతకు తోలుకెళ్లామని, అక్కడ ఓ పొలం వద్ద యూరియా కలిపిన నీటిని తాగి అస్వస్థతకు గురయ్యాయని కాపరులు తెలిపారు. సమాచారాన్ని అందుకున్న పశువైద్య సిబ్బంది వచ్చి పరీక్షించగా.. అప్పటికే ఎనిమిది గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. మిగిలిన 10 జీవాలకు చికి త్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. మృతి చెందిన వాటిలో గోవిందు కు చెందిన నాలుగు గొర్రెలు, నాగరాజుకు చెందిన రెండు గొర్రెలు, ఒక మే క, రామన్నకు చెందిన రెండు గొర్రెలు, ఒక మేక ఉన్నాయి. వాటి మృతితో సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

బొమ్మనహాళ్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దరాంపురంలో శుక్రవారం వరిగడ్డి, వేరుశనగపొట్టు వాములు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన కురుబ నాగప్ప తన 10 ఎకరాల్లోని వరిగడ్డిని, రాయపు రం వన్నూరుస్వామి 2.5 ఎకరాల్లోని వేరుశెనగపొట్టును గ్రామశివారులోని ఒకచోట వాములుగా వేశారు. అయితే వాటికి గుర్తుతెలియ ని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో రెండు వా ములు అగ్నికి ఆహుతయ్యాయయి. వెంటనే స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించా రు. తర్వాత కొద్దిసేపటికి జిందాల్ ఫ్యాక్టరీ నుం చి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో రూ. లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

విడపనకల్లు: మండంలోని పాల్తూరు గ్రామంలో ప్రమాద వశాత్తూ నిప్పంటుకోవడంతో గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. గ్రామంలో సంజీవ అనే రైతు దాదాపుగా ఆరు ఎకరాల్లోని గడ్డిని తన పశువుల కోసం ఊరి చివరిన ఉన్న పీహెచ్‌సీ వద్ద వామిగా వేసుకున్నాడు. అయితే శుక్రవారం ఉదయం ప్రమా ద వశాత్తు నిప్పు పడటంతో వామి మొత్తం కాలి బూడిదైంది. దీంతో రూ. లక్ష మేర నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. ఈ విషయమై పాల్తూరు పోలీసులు విచారిస్తున్నారు.

గాండ్లపాడు వద్ద బ్రిడ్జికి మరమ్మతులు

పుట్లూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపాడు గ్రామశివారులో ఉన్న బ్రిడ్జికి మరమ్మతులు చేపడుతున్నారు. సుమారు రూ.35లక్షల వ్యయంతో బ్రిడ్జి మధ్యలో అడుగు భాగాన ఎక్కువ రంధ్రం పెట్టి మరమ్మతులు చేస్తున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. వర్షాలు పడితే బ్రిడ్జి కింద నీరు వెళ్లలేక పంటలు నీటమునుగుతున్నాయని రైతులు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు నీరు సాఫీగా వెళ్లేలా బ్రిడ్జికి మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం పనులు ప్రారంభం కావడంతో వాహనాలు వెళ్లేందుకు పక్కనే దారిని ఏర్పాటు చేశారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

గుత్తిరూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామశివారులోగల చంద్రాయుని కుంట వద్ద శుక్రవారం చెన్నకేశవస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అక్కడి ఆలయంలో స్వామి వారికి పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి ఉత్సవవిగ్రహాలను రథంపై కొలువుదీర్చి మేళతాళలతో చెరువుకట్ట వద్ద నుంచి గ్రామంలో వరకు ఊరేగింపు చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.